లాభాల బాటలో మునగసాగు రైతులు

- ఉపాధి హామీలో నూరుశాతం సబ్సిడీ
- జిల్లాలో 200 ఎకరాల్లో రైతులు సాగు

ఇబ్రహీంపట్నం: పోషకాల గనిగా పేరు గాంచిన మునగ చేలు రైతులకు కల్పవృక్షంగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఉపాధిహామీ పథకం ద్వారా నూరు శాతం సబ్సిడీ వర్తించడంతో మునగసాగు వైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో 100 మంది రైతులు 200 ఎకరాల్లో వంద శాతం సబ్సిడీతో మునగ సాగు చేపట్టారు. ఆరోగ్యంతో పాటు ఔషధాల పరిశ్రమల్లో వాడటం వలన మంచి డిమాండ్ ఉంది. మార్కెట్‌లో ధర కిలో రూ.80 నుంచి రూ.100 వరకు లభించడంతో రైతులు లాభాలు గడిస్తున్నారు.

రైతులకు వంద శాతం సబ్సిడీ

మునగ తోటలు సాగుచేసే రైతులకు ప్రభుత్వం 100 శాతం సబ్సిడీ అమలు చేస్తోంది. ఉపాధిహామీ పథకంలో సాగుకు గుర్తించబడిన రైతులు విత్తనాలు రూ.2 వేలు, దుక్కులు రూ.2 వేలు ముందుగా ఖర్చు చేసుకోవాల్సి ఉంది. అనంతరం పథకం మంజూరు అయిన అనంతరం రైతుకు ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పని దినాలు చొప్పున విత్తనాలు, దుక్కుల ఖర్చుతో పాటు గుంతలు తీయడం, మొక్కల సంరక్షణ, ఎరువులు, పురుగు మందుల ఖర్చుతో కలిపి ఏడాదికి రూ.27 వేలు చొప్పున రెండేళ్లకు రూ.54 వేలు రైతుల ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తుంది.

మునగతో పాటు అంతర్ పంటలు

చిన్న సన్నకారు రైతులకు మునగసాగు ఆశాజనకంగా ఉంటుంది. కూలీల ఖర్చు, నీటి వినియోగం, ఎరువులు, పురుగు మందుల వినియోగం తక్కువగా ఉంటుంది. అయితే మునగ కాయలు దిగుబడికి సుమారు ఆరు నెలలు పట్టడంతో మూడు నెలల పైరుగా మినుము, వేరుశనగ, సార, కంది పైర్లు అంతర్ పంటలుగా రైతులు సాగు చేస్తున్నారు. ఒకసారి నాటితే ముగనసాగు రెండేళ్ల కాపు ఇస్తుంది. కాలం అంతర్ పంటలతో రైతులు ఆశించిన అదనపు ఆదాయం పొందుతున్నారు.



కొటికలపూడిలో తొలికాపులో రైతు కోసిన మునగ కాయలు

మార్కెట్‌లో ఆశించిన ధర

మునగసాగు చేపట్టిన రైతులు తొలి కోతలోనే ఆశించిన ధర పొందుతున్నారు. కేతనకొండ గ్రామానికి చెందిన రైతు కొమ్మూరి వెంకటస్వామి తన పొలంలో మునగ సాగుచేయగా తొలి కోతలో 320 కిలోల దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో కిలో రూ.80 ధర ఉండగా రూ.25,600 తొలి కోతలో పొందాడు. ఎకరాకు 450 మొక్కలు చొప్పున నాటితే సాలీనా మొక్కకు 200 కాయలు కాస్తే వారానికి క్వింటా చొప్పున కాపు వచ్చినా రూ.8వేలు, నెలకు రూ.32వేలు ఆదాయం రైతుకు సమకూరుతుంది. ఒకవేళ మార్కెట్ రేటు హెచ్చుతగ్గులకు మారినా నెలకు రూ.25 వేలకు తగ్గకుండా ఆదాయం వస్తుందని రైతులు ఆశిస్తున్నారు.



కొటికలపూడిలో మునగ కాయలు కోస్తున్న రైతు కుటుంబం

మునగతో మెరుగైన ఆరోగ్యం

మునగ కాయలు, మునగ ఆకుల్లో అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయని వైద్యులు చెబుతారు. మునగ నిత్యం మన ఆహారంలో తీసుకుంటే ఏ, సీ విటమిన్స్, కాల్షియం, ప్రొటీన్స్, ఫాస్పరస్, ఐరన్, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. అంగన్‌వాడీల్లో గర్భిణులు, బాలింతలకు ఎక్కువగా మునగాకుతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచిస్తారు. ఇటీవల జిల్లాలోని అనేక గ్రామాల్లో ఇంటిల్లపాది ఆరోగ్యం కోసం కలెక్టర్ ఢిల్లీరావు డ్వామా సంస్థ ఆధ్వర్యంలో మునగ మొక్కలు పంపిణీ చేశారు.

వారానికి రెండు క్వింటాళ్ల కాయలు

గతంలో తన పొలంలో మొక్కజొన్న, కూరగాయల సాగుచేశాను. ఉపాధిహామీ పథకంలో సబ్సిడీతో మునగ తోటలు సాగుచేయొచ్చని తెలుసుకున్నాను. ఎకరం పొలంలో మునగతోట వేశాను. అంతర్ పంటగా సార తోట పెట్టాను. వారానికి రెండు క్వింటాళ్ల మునగ కాయలు కోస్తున్నాను. మార్కెట్ ధర బాగుండటంతో లాభాలు వస్తున్నాయి.

– రెంటపల్లి వీరరాఘవులు, రైతు, కొటికపూడి

ఎప్పుడైనా పంట వేయవచ్చు



ఉపాధిహామీ పథకంలో గతంలో జూన్, జులైలో సాగుకు అవకాశం ఉండేది. ప్రస్తుతం ఏ సమయంలో అయినా మునగసాగు చేపట్టవచ్చు. విత్తనాలు, దుక్కులకు ముందుగా ఖర్చు భరించాలి. పథకం మంజూరైతే విత్తనాలు, దుక్కుల ఖర్చుతో పాటు 100 రోజుల పని దినాలకు రూ.27 వేల చొప్పున రెండేళ్లకు రూ.54 వేలు రైతు అకౌంట్‌లో జమవుతాయి.

– మాధవరెడ్డి, ఏపీఓ, ఇబ్రహీంపట్నం మండలం

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఉపాధి చూపిన మంత్రి



ఇబ్రహీంపట్నం: రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఎన్టీటీపీఎస్‌లో క్యాజువల్ లేబర్‌గా విధులు నిర్వహిస్తూ నాలుగేళ్ల క్రితం మృతి చెందిన బత్తుల చిన్నమ్మాయి కుమారుడు దివ్యాంగుడైన బత్తుల రమేష్‌కు ఎన్టీటీపీఎస్‌లో సీఎల్‌గా ఉద్యోగా ఇప్పించి ఉపాధి చూపించాడు. దీంతో ఆ కుటుంబం ఆదివారం జోగి రమేష్ నివాసానికి విచ్చేసి కృతజ్ఞతలు తెలిపారు. నాలుగేళ్లుగా తన తల్లి ఉద్యోగం ఇప్పించాలని ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో ఆ కుటుంబ సభ్యులు ఇటీవల మంత్రిని కలిసి సమస్య వివరించారు. స్పందించిన ఆయన ఎన్టీటీపీఎస్ ఉన్నతాధికారులతో మాట్లాడి క్యాజువల్ లేబర్‌గా ఉద్యోగం ఇప్పించారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



మైలవరం: కార్తిక మాసం ఆఖరి ఆదివారం కావడంతో ద్వారకా తిరుమల దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో మైలవరం కోట మహాలక్ష్మమ్మ ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. సత్యనారాయణస్వామి వ్రతంలో 60మంది దంపతులు కూర్చున్నారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి



తిరువూరు: పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా నిషేధించాలని కోరుతూ లార్డ్స్ స్వచ్ఛంద సంస్థ తిరువూరులో ఆదివారం అవగాహన ప్రదర్శన నిర్వహించింది. ఉపయోగించిన ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, క్యారీ బ్యాగులు వేల సంవత్సరాల పాటు మట్టిలో కలిసే అవకాశం ఉండదని, వాటినుంచి వెలువడే కర్బన ఉద్గారాలతో వాతావరణ కాలుష్యం పెరిగిపోతుందని సంస్థ అధ్యక్షుడు డేవిడ్‌రాజు తెలిపారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ గన్నీ బ్యాగుల వంటి వస్తువుల వాడకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. సంస్థ ప్రతినిధులు మురళి, ప్రకాష్, శంకర్, మహిళలు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు.

కాంట్రాక్ట్ వర్కర్స్‌కు పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఇండస్ట్రీయల్ ఏరియా హెచ్‌పీసీఎల్ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఓటీ, పెయిడ్ హాలిడేస్ అమలు చేయిలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ కోరారు. కార్మికులతో సంస్థ కార్యాలయం వద్ద ఆదివారం సమావేశం నిర్వహించారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. అనంతరం 14మందితో నూతన కమిటీని ఎన్నుకున్నా రు. గౌరవాధ్యక్షుడిగా ఎం.మహేష్, అధ్యక్షుడిగా ఎం.జీవరత్నం, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్, కోశాధికారి బాబునాయక్ ఎన్నికయ్యారు.

జీవిత లక్ష్య సాధనకు వైకల్యం ఆటంకం కారాదు



ఆగిరిపల్లి: జీవిత లక్ష్య సాధనకు వైకల్యం ఆటంకం కాకూడదని జెన్ కంపెనీ అధికార ప్రతినిధి సుంద్రు సాయి ప్రజ్వల్ అన్నారు. తోటపల్లి హిల్ సంస్థలో ఆదివారం 10 మంది దివ్యాంగ విద్యార్థులకు జెన్ కంపెనీ తరఫున కృత్రిమ కాళ్లను అందజేశారు. కార్యక్రమంలో హీల్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, క్యాంపస్ చైర్మన్ పిన్నమనేని ధనప్రకాష్, సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్స్ పని ఎంతో కీలకం

మైలవరం: ప్రజల దైనందిన జీవితంలో భాగమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించే క్రమంలో ఎలక్ట్రికల్ వర్కర్స్ పని ఎంతో కీలకం అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. కార్తిక మాసం పురస్కరించుకుని ఆఖరి ఆదివారం కావడంతో పలు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధన కార్యక్రమాలు పెద్దలు, పిల్లలు ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకున్నారు. మైలవరం తాలూకా ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ శివారులోని మామిడి తోటలో జరిగిన వనసమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ సమక్షేమం కోసం వారి సామూహిక ప్రయోజనాల కోసం తన వంతు చేయూతనందిస్తానన్నారు.

- పొందుగల రోడ్డులోని వివేకానంద గార్డెన్‌లో మైలవరం కాపు సంఘం, ఆర్యవైశ్య సంఘం, రజక సంఘం ఆధ్వర్యంలో పలు చోట్ల వన సమారాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భోజనాలు అనంతరం వివిధ సంఘాలకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆటపాటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. బ్రాహ్మణ సంఘం కార్తిక వన సమారాధన కుంటముక్కల గ్రామంలోని మామిడి తోటలో నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా భాను, అధ్యక్షుడిగా ఏడీ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా రామారావు, ఎస్వీ ప్రసాద్, కార్యదర్శి మారుతి, సహాయ కార్యదర్శులు సుబ్బదాసు, ఆనంద్, కోశాధికారి రాధాకృష్ణ, మరో 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. బ్రాహ్మణ సంఘం సమన్వయకర్తగా వీ బాలాజీప్రసాద్ వ్యవహరించారు.



వన సమారాధన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

దుగ్గి చెన్నారెడ్డికి సీపీఎం నాయకుల పరామర్శ

రెడ్డిగూడెం: మండలంలోని ముచ్చినపల్లి గ్రామానికి చెందిన కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, తెలంగాణ రైతాంగ సాయుధపోరాట యోధుడు దుగ్గి చెన్నారెడ్డిని సీపీఎం నాయకులు ఆదివారం పరామర్శించారు. తెలంగాణ రైతాంగసాయుధ పోరాటంలో దుగ్గి చెన్నారెడ్డి తిరువూరు తాలుకా నుంచి చీఫ్ కొరియర్‌గా పనిచేసిన చెన్నారెడ్డి 70వ దశకంలో కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన చీలిక సమయంలో చెన్నారెడ్డి సీపీఎం వైపు మొగ్గు చూపి పార్టీ ఎదుగుదలకు కృషి చేసి కొంతకాలం ఆ పార్టీలో కొనసాగారు. ఇటీవల చెన్నారెడ్డి అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు, నాయకులు సీహెచ్ మాధవరెడ్డి, అప్పిరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, జంగా వెంకటరెడ్డి పాల్గొన్నారు.



దుగ్గి చెన్నారెడ్డిని పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

ఆధ్యాత్మిక సేవలకు ప్రతీకలు.. ఆర్యవైశ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆధ్యాత్మిక, సామాజిక సేవలకు ఆర్యవైశ్యులు ప్రతీకలుగా నిలుస్తున్నారని ప్రపంచ వాసవీ మహాపీఠాధీశ్వరులు శ్రీధర్ స్వామీజీ పేర్కొన్నారు. పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ, వాసవీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గొల్లపూడిలోని పద్మావతి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య వైభవం పేరుతో ఆదివారం నిర్వహించిన కార్తిక వనసమారాధన వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి హాజరైన ఆయన ప్రవచిస్తూ భక్తులను అనుగ్రహించడం కోసం అమ్మవారు అనేక రూపాల్లో అవతరిస్తుందని, వాటిల్లో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అవతారం ఒకటని చెప్పారు. తొలుత శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి కల్యాణం, అనంతరం సామూహిక శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలను ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజాధికాల తరువాత స్వామి అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు వీవీకే నరసింహారావు, పారేపల్లి రాకేష్, కొణిజేటి రమేష్, దర్శి వాసు, నూకల నాగేశ్వరరావు, జాలాది వెంకటేశ్వరరావు, బొగ్గవరపు సత్యనారాయణ, తుమ్మలపెంట శ్రీనివాసులు, శేగు వెంకటేశ్వర్లు, చుండూరు ఉమామహేశ్వరరావు, కేవీఎల్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



వనసమారాధనలో ప్రవచిస్తున్న శ్రీధర్ స్వామీజీ

అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారిని ఆదివారం మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందించారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌ను ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు. కేడీసీసీ బ్యాంక్ డైరక్టర్ కొమ్మినేని రవిశంకర్, ఏఈఓ తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.



మధుర గాయకుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలి

విజయవాడ కల్చరల్: మధుర గాయకుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి, శ్రీ కళాభారతి, స్వరఝురి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదిక మీద అలనాటి మధుర గాన లహరి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.

వన సమారాధనల సందడి

తిరువూరు: కార్తిక మాసంలో చివరి ఆదివారం తిరువూరు ప్రాంతంలో వనభోజనాలతో సందడి నెలకొంది. యాదవ సంక్షేమ సంఘం ఏకొండూరు మండలం గోపాలపురంలో నిర్వహించిన వనభోజన కార్యక్రమానికి తిరువూరు, పెనమలూరు ఎమ్మెల్యేలు కొక్కిలిగడ్డ రక్షణనిధి, కొలుసు పార్థసారధి తదితరులు విచ్చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం తిరువూరు రాజుపేటలో నిర్వహించిన వనభోజనాలకు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ అధ్యక్షుడు తోలేటి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆర్టిస్ట్స్ అసోసియేషన్ కూడా వనసమారాధన నిర్వహించింది.

కాపు సంఘం ఆధ్వర్యంలో..

విస్సన్నపేట: స్థానిక పట్టణ కాపు సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన కార్యక్రమం ఎ.కొండూరు రోడ్డులో మామిడితోటలో ఆదివారం నిర్వహించారు. ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, వనభోజనాలు చేశారు. చిన్నారులకు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. మహిళలు, పురుషులు చిన్నారులు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.

గుంటుపల్లిలో..

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): మనః సంకల్పిత సిద్ధి పీఠం ఆధ్వర్యంలో గుంటుపల్లిలో నిర్వహించిన కార్తిక వన సమారాధన కార్యక్రమంలో ఎంపీపీ పాలడుగు జోత్స్న దంపతులు ఆదివారం పాల్గొన్నారు. సంస్థ పీఠాధిపతి శ్యామ్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో పాల్గొని మనఃసంకల్పిత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జోత్స్న, దుర్గాప్రసాద్ దంపతులను పీఠం ప్రతినిధులు సత్కరించారు.

యాదవులందరూ కలసికట్టుగా ఉండాలి

ఏ.కొండూరు: యాదవులందరూ కలసి కట్టుగా ఉండాలని పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. మండలంలోని గోపాలపురం కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగిన తిరువూరు నియోజకవర్గ యాదవ సంఘం కార్తీక వన సమారాధాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ సంఘాల అభివృద్ధికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఎమ్మెల్యే కె. రక్షణనిధి మాట్లాడుతూ యాదవులకు అన్ని వేళలా అండగా ఉంటామని, వారి సమస్యలు పరిష్కరించటానికి కృషి చేస్తామన్నారు. తిరువూరు నియోజకవర్గంలో యాదవ సంఘం కార్యాలయానికి స్థలం కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, యాదవ సంఘం నాయకులు చెన్నారావు, రామకృష్ణ పాల్గొన్నారు.



ఎ.కొండూరు మండలం గోపాలపురంలో భోజనం వడ్డిస్తున్న తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి



తిరువూరులో విశ్వబ్రాహ్మణ సంఘ వనసమారాధనలో పాల్గొన్న శ్రీకాంత్



విస్సన్నపేట మండలం కాపు సంఘం వనసమారాధనలో ఉసిరి చెట్టుకు పూజలు



గోపాలపురం వన సమారాధన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

ఫ్లైయాష్ బ్రిక్స్ కంపెనీ ప్రారంభించిన ఎమ్మెల్యే

కాచవరం(ఇబ్రహీంపట్నం): వైఎస్సార్ సీపీ నాయకుడు, కొటికలపూడి పీఏసీఎస్ చైర్మన్ సయ్యద్ జానీ నూతనంగా నెలకొల్పిన ఫ్లైయాష్ బ్రిక్స్ కంపెనీని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దండుబోయిన రాజేంద్రప్రసాద్, రెంటపల్లి నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు లంకే అంకమోహనరావు, పఠాన్ నాగులు, కొమ్మూరి అచ్చారావు, జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



బ్రిక్స్ కంపెనీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

19 నుంచి నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సుప్రసిద్ధ మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయంలో నూతన వైనతేయ మండపం, ధ్వజస్తంభ త్రయాహ్నిక ప్రతిష్ట మహోత్సవాలు ఈ నెల 19 నుంచి నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. స్థానిక మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ధర్మకర్తల మండలి ఛైర్మన్ కనపర్తి కొండలరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తలు, ప్రత్యేక ఆహ్వానితులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ 19 నుంచి 22వ తేదీ వరకు వేదపండితుల మంత్రోచ్చారణలతో ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవాలు జరుగుతాయన్నారు. 22న అన్నప్రసాద వితరణ జరుగుతుందని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

నేడు లంకభూముల పట్టాల పంపిణీ

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం లంకభూముల లబ్ధిదారులకు మంజూరు చేసిన పట్టాలను సోమవారం స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుతో పాటు మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొని సుమారు 12 వందల మంది లంకభూమి లబ్ధిదారులకు పంట్టాలు పంపిణీ చేస్తారన్నారు. మండలం పరిధి గ్రామాల్లోని లబ్ధిదారులు కార్యక్రమానికి హాజరై పట్టాలు పొందాలని తహసీల్దార్ సూచించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

నూజివీడు: పట్టణంలోని 8, 9వ వార్డుల్లో సోమవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఈ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని ఆయా కుటుంబాలకు వివరిస్తారని పేర్కొన్నారు.

నేడు నూజివీడులో 'జగనన్నకు చెబుదాం'

ఏలూరు(మెట్రో): నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు జిల్లాస్థాయి అధికారులంతా హాజరై అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

ముసునూరు: క్రీస్తు బోధనలు ఆచరణీయమని వార్డెన్ షేక్ నజీర్ పేర్కొన్నారు. ముసునూరులోని బీసీ బాలుర హాస్టల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి నిర్వహించారు. సూరేపల్లి పాస్టర్ దానియేలు క్యాండిల్ సర్వీస్, కేక్ కటింగ్ నిర్వహించి, బాలలందరికీ క్రిస్మస్ సందేశంతో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రిస్మస్ తాత చిన్నారులకు కానుకలు, బహుమతులు అందించారు.

క్షీరబంధు చెక్కు అందజేత

రెడ్డిగూడెం: మండలంలోని ముచ్చనపల్లిలో ఇటీవల పాడి రైతు కిలారి లోకేశ్వరరావు మరణించడంతో కృష్ణా మిల్క్ యూనియన్ క్షీరబంధు పథకం ద్వారా మంజూరైన రూ.50 వేల చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు ట్రస్టు సభ్యురాలు ఎం.విజయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు ఆముదాల సాంబశివరావు ఆదివారం అందజేసినట్లు తిరువూరు చిల్లింగ్ సెంటర్ మేనేజర్ టి.సాంబశివమూర్తి తెలిపారు. యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, సూపర్‌వైజర్ ప్రసాద్, వేతన కార్యదర్శి రఫీ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడిగా రవిశేఖర్

ఆగిరిపల్లి: వైఎస్సార్ సీపీ ఆగిరిపల్లి మండల ఉపాధ్యక్షుడిగా మల్లంపల్లి రవిశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన స్థానిక ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేరప్రవృత్తి మానుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రౌడీషీటర్లు, నేరస్తులు నేరప్రవృత్తి మానుకోవాలని గుణదల సీఐ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక గుణదల పోలీస్ స్టేషన్‌లో నేరస్తులు, రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తుల ప్రతీ కదలికను పోలీసులు గమనిస్తుంటారని, ఏ చిన్న నేరం చేసినా పోలీసుల నుంచి తప్పించుకోలేరని చెప్పారు. ఎక్కడైనా నేరం జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. నేరస్తుల తీరు మారకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరం చేసే ముందు కుటుంబ సభ్యులను గుర్తు తెచ్చుకోవాలన్నారు. నేరస్తులు ప్రవర్తన మార్చుకుని జనజీవన స్రవంతిలో కలిసిపోయి గౌరవప్రదంగా జీవించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సత్యప్రసాద్, వెంకట్రావు, గుణదల పోలీసులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆస్పత్రిలో ఉన్న బంధువులను పరామర్శించేందుకు వచ్చిన మహిళ అదృశ్యమైన ఘటనపై గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కోనంకి గ్రామానికి చెందిన తుమ్మ తిరుపతమ్మ తన అత్త అంజలితో కలిసి ఈ నెల 7న విజయవాడకు వచ్చింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తోటి కోడలిని చూసేందుకు పాత ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. ఇద్దరూ కలిసి ఆస్పత్రిలో ఉన్న పేషెంట్‌ను పరామర్శించి బయటకు వచ్చారు. అదే రోజు రాత్రి 9.30 గంటల సమయంలో ఆమె అత్త అంజలి ఆస్పత్రి బయట తెలిసిన వారితో మాట్లాడుతుంది. ఆ సమయంలో తిరుపతమ్మ అక్కడ నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం అంజలి వెతికినప్పటికీ ఆచూకీ తెలియలేదు. దీనిపై గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.